


"సంతలాంటిదేదో పెట్టినట్లున్నారు. ఓసారెళ్ళి చూసొద్దాము. వస్తావుటే?"

అంటూ తన అమూల్యమైన కోరికను తన మనుమరాలైన జయంతికి ఏకరువుపెట్టింది ఓ అరవై ఏళ్ళ బామ్మగారు.

# అఘాయిత్యం

సిద్ధార్థ

జయంతి నవ్వి "సంత కాదే బామ్మా! ఎగ్జిబిషన్" అంది.

బామ్మ తన్నుతాను సమర్థించుకుంటూ "ఆ! ఏదో ఒకటిలెద్దూ!" అంది.

జయంతి స్నిగ్ధ కంఠంతో "సరే తొందరగా తెములు. ముందు నాకు జడ వెయ్యి" అంటూ ఎగ్జిబిషన్ ఉరఫ్ సంతకు వెళ్ళడానికి సంసిద్ధులవుతున్నారు. చక్కగా తయారయి ఎగ్జిబిషన్‌ను చూడటానికి వెళ్ళారు.

ఎంతో మంది జనసమూహాన్ని కూడ బెట్టుకుని తనకున్న కరెంట్ కళతోపాటు సంగడి కళను కూడా ఆర్జించుకుని బామ్మగారికి, ఆమె మనుమరాలైన జయంతికి స్వాగతం పలికింది ఎగ్జిబిషన్.

లోపలికి అడుగుపెట్టిన బామ్మగారికి జనమంతా కలిసి ఎన్నో రకాల పూలన్నీ కలిసి కుప్ప బోసినట్లు కనిపించింది. వారిని వారి సందడిని చూసి బామ్మ నిట్టూర్చి "హు! ఏం కాలం? మా కాలంలో సంతంటే వేరేవూళ్ళ జనం బళ్ళు కట్టించుకుని చూడ్డానికి వచ్చేవారు తెలుసా?" అన్నది.

ఆ మాటలకు జయంతి విసుగుచెందని మార్చి, సెప్టెంబరు విద్యార్థిలా ఊకొడుతూ వింటోంది. చాలా సేపటిదాకా వారలా తిరిగి చివరికి 'జైంట్‌వీల్' ఉన్న ప్రదేశానికి వచ్చి చేరారు.

బామ్మగారు అరటి మొదళ్ళలాంటి తన కాళ్ళను పట్టుకుని "ఉష్! అబ్బా!" అంటూ ఎగరొప్పుతూ కుస్తీ పట్టిన వస్తాదులా ఇసుకలో కూలబడింది.

జయంతి కిలకిలా నవ్వి "కాళ్ళిప్పుడే నొప్పిపుడుతున్నాయా బామ్మా?" అంది తన చెవులకున్న జూకాలు చంచలంగా ఊగిస్తూ.

"నొప్పా! పాడా!" అంటూ గిరగిరా తిరుగుతున్న రంగులరాట్నం ఉరఫ్ జైంట్‌వీల్‌కేసి నిర్నిమేష దృష్టిని చూస్తూ



"అదెక్కుదాం పద" అన్నది.

జయంతి భయపడి "అమ్మో! అదెక్కాలంటే నాకు భయమే బామ్మా" అన్నది.

బామ్మగారు ఆశ్చర్యంతో తన బుగ్గలు అంగుళం లోతు చొప్పున నొక్కుకుంటూ "ఇంతోటి ముసిలిముండ ఎక్కంగా లేంది నీలాంటి కుర్రకుంకకు భయమేమిటే?" అంది.

అయినాసరే జయంతి "కళ్ళు తిరుగుతాయి వద్దే" అన్నది.

"కళ్ళా! ఇంకేమన్నానా? ఏం తిరగవు ఓసారి ఎక్కి చూడు" అంటూ భారీ కాయాన్ని లయబద్ధంగా కదిలిస్తూ లేచి జయంతి రెక్క పుచ్చుకుని లేపింది.

ఇక జయంతికి తప్పిందికాదు. బామ్మగారి కోరిక ఫలించింది. ఇప్పుడామె ఆరో నెంబరు పెట్టెలో జైంట్‌వీల్‌మీద మొగుడు పోయిన తరువాత సింహాసనమెక్కిన మహారాణిలా కూర్చుంది.

కొంత సేపటికి జైట్‌వీల్ ఫుల్ అయిపోయింది. అది నెమ్మదినెమ్మదిగా తిరుగుతూ ఒక్కసారిగా వేగాన్నిపుంజుకుంది. బామ్మగారు అది తిరుగుతుంటే కలిగే ఆనందాన్ని హాయిగా అనుభవిస్తోంది. జయంతి మాత్రం ముందుకమీక్కని బామ్మ చెయ్యిని గట్టిగా పట్టుకుని కిందకు దిగేటప్పుడు కలిగే భయానికి నోటమాటరాక అలా కూర్చుండిపోయింది.

ఇంతలో చిన్న చినుకులతో వాన ప్రారంభమైంది. వాన పడటం తెలిసి బామ్మగారు ఆపమని అరవసాగింది. వాడెంతకీ ఆపకపోయేసరికి గోల ప్రారంభించింది. జైంట్‌వీల్ తిప్పేవాడు ఆపి బామ్మగారిని "ఏమిటీ?" అన్నాడు.

ఆవిడ అతనిమీద విరుచుకుపడి "కళ్ళు పోయాయా? ఉన్నాయా? వాన పడుతూంటే తెలీడంలా?" అంది.

వాడొక్కసారిగా అంతులేనంతగా ఆశ్చర్యపోయి శతకోటిలింగాలు ఒక్క గుక్కలో దూరేంతగా నోరుతెరచి "వానా!" అన్నాడు. కొంత సేపటికి బామ్మగారు కూర్చున్న పెట్టెపైకి చూశాడు. ఆరో నెంబరు పెట్టెపైనున్న ఐదోనెంబరు పెట్టె ఖాళీగా కనిపించేసరికి వాడికి సంగతి బోధపడి - చుట్టూ చూసి పెద్ద పెటున నవ్వసాగాడు.

వాడి నవ్వుకు బామ్మగారు ముఖం వికృతంగా చేసుకుని తను కూర్చున్న పెట్టెపైపెట్టెకేసి చూసేసరికి అక్కడెవరూ లేకపోవటము, చుట్టుప్రక్కల ఎక్కడా వాన కురిసిన ఆనవాలు కనిపించక పోవటంతో సంగతి బోధపడి పెద్దపెట్టున రోదిస్తూ "నా మడి, శుచి మంటగలిపారు. పిరికి ప్రాష్టం వెధవలు" అని చించుకుని అరుస్తూ జయంతిని లాక్కుంటూ వెళ్ళిపోయింది.

ఈ లోపల సంగతి తెలిసిన జనాలు ఒక్కొక్కరుగా ఘొల్లు ఘొల్లున నవ్వసాగారు.

ఇంతకీ జరిగిన సంగతేమిటంటే - బామ్మగారి పై పెట్టెలోవున్న ముగ్గురు వ్యక్తులలో ఎవరో కాని విపరీతమైన భయం కలిగి, కళ్ళు తిరిగి ఇక తాళలేక సరిగ్గా అఘాయిత్యం చేసి ఊరుకున్నారు. దాని ఫలితంగా బామ్మగారి మడి, శుచి మంటగలిశాయి. ●